క్లుప్తంగా

ప్రైవేటు గోడౌన్‌లో యూరియా నిల్వ

గార: రైతు సేవా కేంద్రాలు(ఆర్బీకే), సచివాలయ గోడౌన్లు వద్ద నిల్వ చేయాల్సిన ప్రభుత్వం సరఫరా చేసే యూరియాను ప్రైవేటు గోడౌన్‌లో ఉంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాడాడ పంచాయతీకి సోమవారం 20 టన్నుల యూరియా వచ్చింది. సచివాలయంలో ఎరువు నిల్వ చేసేందుకు గోడౌన్ ఉన్నా, కొందరు వ్యక్తులు అధికారులపై ఒత్తిడి చేసి అచ్చెన్నపాలేంలోని ఒక ప్రైవేటు గోడౌన్‌లో దింపించారు. ఈ విషయమై ఏవో డి.పద్మావతి వద్ద ప్రస్తావించగా సచివాలయం గోడౌన్ వద్ద యూరియా ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు.

బ్యాగ్ అందజేత

శ్రీకాకుళం అర్బన్: మండాకురిటి గ్రామానికి చెందిన బి.వరుణ్‌ప్రసాద్ అనే ప్రయాణికుడు సోమవారం సాయంత్రం పాలఖండ్యాం నుంచి చిలకపాలేంనకు ప్రయాణ నిమిత్తం ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు ఎక్కే సమయంలో తన వెంట బ్యాగ్ కూడా తెచ్చుకున్నాడు. అయితే తను దిగాల్సిన గమ్య స్థానం వచ్చిందని గుర్తించి చిలకపాలేంలో దిగేటప్పుడు తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను బస్‌లో మరచిపోయాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆర్టీసీ బస్సులో బ్యాగ్ మరచిపోయిన విషయం గుర్తుకొచ్చి వెంటనే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బయలుదేరి వెళ్లాడు. అదే సమయంలో వరుణ్‌ప్రసాద్ ప్రయాణించిన బస్ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరిపోవడంతో ప్రయాణికులందరూ దిగిపోయారు. బస్‌ను డిపోలో పెట్టే సమయంలో ఆ బస్ కండక్టర్ కేజేఎం రావు ఒకసారి బస్ మొత్తంగా పరిశీలించగా బ్యాగ్ కనిపించింది. ఎవరో ప్రయాణికుడు బ్యాగ్‌ను మరచి దిగిపోయాడని గుర్తించి ఆ బ్యాగ్‌ను ఒకటవ డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు సమక్షంలో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించారు. ఇంతలో ప్రయాణికుడు రావడంతో అతనికి అప్పగించారు.

వివాహిత అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట గ్రామానికి చెందిన ఒక వివాహిత ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయం వాకింగ్ కోసం వెళ్లి అప్పటి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో డీఆర్వో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని జిల్లా రెవెన్యూ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన ఎం.వేంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు సాదర స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఆర్వో వేంకటేశ్వరరావుకు ఆలయ అధికారులు అభినందనలు తెలియజేశారు. ఆయనతో పాటు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోహనాద్రాచార్యులు తదితరులున్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



కాలిన వలలు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: చేపలు వేట చేసుకునే వలలు కాలిపోయిన మత్స్యకారులను ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. డి.మత్స్యలేశం సముద్ర తీరంలో కాలిపోయిన వలల బాధితులు కోడ గురుమూర్తి, కొర్లయ్యలను సోమవారం పరామర్శించారు. అగ్ని ప్రమాద సంఘటన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు నాయకులు సనపల నారాయణరావు, మూగి శ్రీరాములు, దుమ్ము కృష్ణారావు, కుందు లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరామర్శ

రణస్థలం: మండలంలోని కోటపాలెం గ్రామానికి చెందిన కాయితి మల్లేష్ ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ సుంకర కిషోర్ కుమార్, గ్రామ నాయకులు గొర్లె శశి భూషణ్, జోగ శ్రీనివాసరావు, అదపాక శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

సత్తాచాటిన సిక్కోలు బాలికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికలు మరోసారి అదుర్స్ అనిపించేలా సత్తాచాటారు. చిత్తూరు జిల్లా కాణిపాకం వేదికగా ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు 43వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో ఛాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచి శభాష్ అనిపించుకుంది. జిల్లా క్రీడాకారిణుల రాణింపుపై జిల్లా ఖోఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు, సాదు శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణ సేవ సోమవారం ఉదయం ఆలయ అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు కల్యాణం జరిపించారు.



ఎన్నాళ్లకెన్నాళ్లకు

శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని కునుకుపేట నుంచి కల్లేపల్లి వరకు ఎట్టకేలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ఈ మార్గంలో విద్యుత్ దీపాలు వెలగక అంతా చీకటిమయం అయ్యింది. దీనిపై ఇటీవల వార్తా కథనాలు రావడంతో ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. దీనిలో భాగంగా సోమవారం యుద్ధ ప్రాతిపదికన రోడ్డుకు ఆనుకొని ఉన్న స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు చేశారు.

– శ్రీకాకుళం రూరల్



ఆదమరిస్తే అంతే

ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలేం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కాలువ పలకలు చాలా వరకూ పగిలిపోయి ఊడిపోయాయి. దీంతో రోడ్డుపైన ప్రయాణాలు చేసేవారు కొంచెం ఆదమరిస్తే అందులో పడిపోయే ప్రమాదం ఉంది. అందువలన కాలువపై పలకలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల



మంచినీరు వృథా

తమ్మినాయుడుపేటలో తాగునీరు అందించే సురక్షిత మంచినీటి పథకం ట్యాంకు లీక్ అవుతోంది. సమీకృత మంచినీటి పథకం పైప్‌లైన్ ద్వారా నీరు ఈ ట్యాంకుకు సరఫరా చేసి ప్రజలకు అందజేస్తున్నారు. అయితే లీకేజీ వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లీక్ వల్ల నీరు పాడవ్వడంతో పాటు భవిష్యత్తులో ట్యాంకు కూలే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



గోతులను పూడ్చరూ..!

శ్రీకూర్మం గ్రామం నుంచి దువ్వుపేట, సునామీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్, దువ్వుపేట సచివాలయానికి ప్రజలు ఇదే రోడ్డు మీద నిత్యం వెళ్తుంటారు. అయితే మలుపులతో పాటు గోతులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అందువలన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– గార

సీఏఎస్ కమిటీ స్క్రూటినీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కమిటీ సోమవారం స్క్రూటినీ నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్‌కు సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతి, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతికి సంబంధించి ఈనెల 4వ తేదీన అధికారులు కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అర్హత పరిశీలనకు ఏయూ నుంచి అధికారులు వచ్చి దరఖాస్తులు పరిశీలించారు. అర్హతలు ఉన్నవారికి భవిష్యత్తులో ఇంటర్వ్యూలు నిర్వహించి పదోన్నతులు కల్పిస్తారు. అనుభవం, విద్యార్హత, పదోన్నతికి కావాల్సిన అర్హతలు, ఉన్నత విద్యా మండలి నిబంధనలు వంటివి పరిశీలించారు. సీనియర్ ప్రొఫెసర్ అంశంపై అర్హతలు కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. వర్సిటీలో కీలక అధికారి తన ప్రయోజనం కోసం ప్రయతిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

సేంద్రీయ సాగు.. ఫలితాలు బాగు

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ

ఎచ్చెర్ల:

మండలంలో ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరంగా ఉంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తోంది. ప్రకృతి వ్యవసాయం సాగు వలన ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం 22 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్‌ఎంపురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాయుడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. వీరంతా దాదాపు చిన్న, సన్నకారు రైతులే. ఆకుకూరలు, కూరగాయలు, బొప్పాయి, నిమ్మ, మామిడి, జీడిమామిడి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

సహజ ఎరువులతోనే...

పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమిసంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి సారించారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడడానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

మార్కెట్ విస్తరణతో ఆసక్తి

మండలంలోని గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు



కషాయాలను నిల్వ చేస్తున్న రైతులు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట

అదనపు ఆదాయం



బొప్పాయి, ముల్లంగి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెంచుతున్నాము. ఇవి ఏపుగా ఎదిగాయి. ఫలసాయానికి వచ్చేలోగా అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలుగా కూరగాయులు, ఆకుకూరలు సాగు చేపట్టాం. ఇవికూడా ఏపుగా ఎదిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి.

– సూర అప్పన్న, రైతు, కేశవరావుపేట.

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయం వలన భూములు సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా గ్రామాల మీదుగా వెళ్లేవారు ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతన్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆశించిన రాబడి వస్తుంది.

–గొలివి రామకృష్ణ, గొలివివానిపేట.

సాగు పెరిగింది



మండలంలో 22 పంచాయితీల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగడం వలన గతేడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో దీర్ఘకాలంగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఈయూ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో దీర్ఘకాలంగా పని చేస్తున్నటువంటి ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్లు ఆర్టీసీ సంస్థ ఇస్తున్న కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇలా అనేక సమస్యలపై అసోసియేషన్ ద్వారా కార్మిక శాఖకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ, రాష్ట్ర విశ్రాంత సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ శర్మ, ఏపీపీటీడీ ఈయూ శ్రీకాకుళం 1డిపో కార్యదర్శి త్రినాథ్, ఏపీపీటీడీ ఈయూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేజీరావు, శ్రీకాకుళం 2 డిపో సెక్రటరీ కె.బాబురావు, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, జిల్లా సెక్రెటరీ పి.సంతోష్, జిల్లా ట్రెజరర్ ఆర్.నవీన్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి స్వరూప్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పలాసలో పోలీస్‌స్టేషన్ వేదికగా టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేసి ఇష్టం వచ్చినట్లు కొట్టడం దారుణమని అన్నారు. తక్షణమే ఎస్పీ స్పందించి దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఎక్కడా ఇటువంటి సంఘటనలు జరగలేదన్నారు. పార్టీకి చెందిన పెద్దలంతా ఆలోచన చేసి ఛలో పలాస నిర్వహిస్తామని తెలియజేశారు.



ఇసుక అక్రమ రవాణా



తమ్మినాయుడుపేట సమీపంలో ట్రిప్పర్‌కు లోడ్ చేసేందుకు సిద్ధం చేసిన ఇసుక

ఎచ్చెర్ల క్యాంపస్: ఉచితం ముసుగులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. గత కొన్ని రోజుల నుంచి నిరంతరం విశాఖపట్నంకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి స్థానిక రిజిస్ట్రేషన్ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఈ ఇసుకను సింగూరు రోడ్డు, జాతీయ రహదారిని అనుకొని ఉన్న తమ్మినాయుడుపేట సమీపంలో, కుశాలపురం నవభారత్ సమీపంలో, తోటపాలేం, కొయ్యరాళ్లు, కింతలిమిల్లు ప్రాంతాల్లో లే అవుట్లలో పోగులు వేస్తున్నారు. అక్కడ నుంచి ట్రిప్పర్లు, లారీలు ద్వారా విశాఖపట్నం తరలిస్తున్నారు. మరో పక్క ఇసుక రీచ్‌ల్లో స్థానిక వాహనాలు తప్ప మిగతా వాహనాలను అడ్డుకుంటున్నారు. ఉచిత ఇసుక ప్రకటన తర్వాత అధికారులు సైతం నిబంధలు పట్టించుకోవడం లేదు. అయితే ఉచిత ఇసుక విధానంలో నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సింహాచలం హెచ్చరించారు.



నవభారత్ సమీపంలో ఇసుక పోగువేసిన దృశ్యం

సపక్‌తక్రా క్రీడాకారులు జిల్లాకు గర్వకారణం

శ్రీకాకుళం న్యూకాలనీ: సపక్‌తక్రా క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారని సపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అన్నారు. శ్రీకాకుళం జిల్లా సపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా ఈనెల 22, 23 తేదీల్లో 34వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సపక్‌తక్రా ఛాంపియన్‌షిప్–2024 పోటీలు విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే. జిల్లాలో మొట్టమొదటిసారిగా జరిగిన ఈ పోటీల్లో శ్రీకాకుళం పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలవగా, మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. దీంతో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులతోపాటు, స్టేట్ మీట్ టోర్నీకి ఆర్థికంగా సహకరించిన సపక్‌తక్రా సంఘ ప్రతినిధులను సోమవారం ఓ హోటల్‌లో అభినందిస్తూ సమావేశాన్ని నిర్వహించారు. సాహకారాన్ని అందించిన సంఘ బాధ్యులు, సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి, కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి, ఎస్‌వీడీ హోటల్ యజమాని, సంఘ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్, సంఘ ఉపాధ్యక్షుడు పి.శ్రీకాంత్, ట్రాఫిక్ జామ్ హోటల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మానస హోటల్ యజమాని, ఉపాధ్యక్షుడు పైడి శ్రీనివాస్, సంఘ కోశాధికారి బీవీఎస్ఎన్ రాజు, బాలమురళీకృష్ణ, నక్క శంకర్, మామిడి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా క్రీడాకారులు, సంఘ ప్రతినిధులు, సభ్యులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్‌రెడ్డి

ఉత్సాహంగా అంతర్ కళాశాలల పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం బీఆర్ ఏయూ పరిధి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. కార్యక్రమానికి ఎ.జగన్మోహనరావు, యూనివర్సిటీ పీఈ హెచ్ఓడీ ఎం.శ్రీనివాసరావు, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి బి.మోహనరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, పీడీ జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక పఠనంతో విజ్ఞానం, విషయ పరిజ్ఞానం లభిస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో సోమవారం విశాలాంధ్ర పబ్లికేషన్స్ మొబైల్ పుస్తక అమ్మక దుకాణాన్ని ప్రారంభించి, పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థులు అకడమిక్, కాంపిటేటివ్, విజ్ఞాన, బయోపిక్ వంటి పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల పెంపు దారుణం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే కరెంటు ఛార్జీలు పెంచడం దారుణమని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అమలుకాని హామీలను సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించి అధికారంలోకి రాగానే పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని, పెంచిన కరెంటు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరుపున కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత

గార: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న గార గ్రామానికి చెందిన పాట్నూరు నవీనకు బోరవానిపేటకు చెందిన సాయి యువజన సంఘ సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. సంఘం ద్వారా రూ.15 వేలు, ఎస్.రమేష్ రూ.5 వేలను కలిపి నవీన కుమారుడు దేవేంద్రకు అందించారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ బి.సింహాచలం, ఉప సర్పంచ్ బి.కోటేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, ఢిల్లీశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు మంజూరు చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కంపోనెంట్ పనులు గ్రామసభ తీర్మానం మేరకు మండల పరిషత్‌లో ఆమోదం జరిగినా, పరిపాలన అనుమతులు మంజూరు చేయలేదని చెప్పారు.ఆయనతో పాటు అల్లు సూర్యనారాయణ, సీపాన దిలీప్‌కుమార్ ఉన్నారు.

59 బాణసంచా దుకాణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలో 59 బాణసంచా ప్రత్యేక దుకాణాల ఏర్పాటుకు ఆర్డీవో సాయి ప్రత్యూష అనుమతులు ఇచ్చారు. వీరు ఈనెల 29వ తేదీ నుంచి నుంచి దీపావళి వరకు ఈ తాత్కాలిక బాణసంచా దుకాణాలు నిర్వహించవచ్చునని తెలిపారు. ఈ అనుమతులు పొందిన వారు నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకొని అమ్మకాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనుమతులు స్థానిక సంస్థలు, ఫైర్, జీఎస్టీ, పోలీస్ తదితర శాఖల సిపార్సుల మేరకు మంజూరు చేయడం జరిగిందన్నారు. శ్రీకాకుళం నగరానికి సంబంధించి బాణసంచా దుకాణాలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయడం జరగుతుందన్నారు.

ప్రాంతం	షాపుల సంఖ్య	జలుమూరు	2
శ్రీకాకుళం నగరం	21	లావేరు	1
శ్రీకాకుళం రూరల్	4	నరసన్నపేట	3
అమదాలవలస	1	పాలాకి	5
బూర్జ	2	పొందూరు	2
ఎచ్చెర్ల	7	రణస్థలం	7
గార	4		

సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ బాలురు జట్టుకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలు నవంబర్ 6 నుంచి 11వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్ వేదికగా జరగనున్నాయి. జిల్లా నుంచి మెట్ట హర్షవర్ధన్, పూజారి కల్యాణ్‌రామ్, చింతాడ జశ్వంత్ ఎంపికయ్యారు. ఎంపికైనవారంతా ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు కావడం విశేషం. వీరిని ఆ పాఠశాల పీడీ మొజ్జాడ వెంకటరమణ ఉన్నతంగా తీర్చిదిద్దుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేస్తున్నారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు తెలిపారు. కాగా శ్రీనగర్‌లో జరగనున్న ఈ టోర్నీకి ముందు అనంతపురంలోని ఆర్‌డీటీ వేదికగా ఈనెల 29 నుంచి జరగనున్న శిక్షణ శిబిరాలకు ఈ యువ క్రీడాకారులు హాజరవుతున్నారు. క్రీడాకారులకు వెంకటరామరాజు, సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంపీ రమణ, ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, జి.మల్లేష్, తదితరులు శ్రీకాకుళంలో వీడ్కోలు పలికి, పలు సూచనలు చేశారు.



ఎంపికైన క్రీడాకారులతో కలిదిండి వెంకటరామరాజు, ఎంపీ రమణ, తిరుపతి